
# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్
ఆదివారం 27 జూలై 2025 పేజీలు 8


## ఆటలో గెలుపు ఓటములు సహజం..
# ఓటమికి కుంగిపోకూడదు



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సాహిస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగవ (U-15) సబ్ జూనియర్స్ పురుషులు, అమ్మాయిల స్టేట్ లెవెల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ సెమీ ఫైనల్ పోటీలకు మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ బాక్సింగ్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బాక్సింగ్ చాలా మంచి ఆట కానీ ఆడటం చాలా కష్టమన్నారు. ఈ బాక్సింగ్ మీట్?లో తెలంగాణ వ్యాప్తంగా

-2 లో



# టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా

- ముఖ్యమంత్రి ఆమోదం... ఒకట్రెండు రోజుల్లో షెడ్యూల్ జారీ
- దాదాపు 3,500 మందికి ప్రయోజనం
- భాషా పండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్ల హోదా

**హైదరాబాద్ పెన్ పవర్::** ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వారికి కొద్ది రోజుల్లో పదోన్నతులు దక్కనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా ఈ దస్త్రంపై సంతకం చేశారు. విద్యాశాఖ ఒకట్రెండు రోజుల్లో పదోన్నతుల కోసం షెడ్యూల్ జారీ చేయనుంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది. మొత్తం మీద సుమారు 3,500 మందికి పదోన్నతులు లభించనున్నాయి.

**900 వరకు జీహెచ్ఎం ఖాళీలు**

గత ఏడాది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్ఎంలుగా పదోన్నతులు ఇచ్చారు. వివిధ కారణాల వల్ల మల్టీ జోన్-2(హైదరాబాద్)లో మిగిలిపోయిన జీహెచ్ఎం పోస్టులు, పదవీ విరమణ తర్వాత వచ్చిన వాటితో కలిపి రాష్ట్రంలో 900 వరకు ఖాళీలు ఉన్నాయి. ఫలితంగా చాలా ఉన్నత పాఠశాలల్లో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేరు. ప్రస్తుతం సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జి హెచ్ఎం బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ గెజిటెడ్ హెచ్ఎంలు రావాలంటే స్కూల్ అసిస్టెంట్లకు సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలి. ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున కనీసం 900 మంది స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభిస్తుంది.

-2 లో

## ఏఐ వినియోగంపై ఉద్యోగులకు
# శిక్షణ ఇవ్వాలి
### ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీఐకి ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** కృత్రిమ మేధ(ఏఐ) పరిజ్ఞానాన్ని ప్రభుత్వ పరిపాలనలో దేశంలోనే మొట్టమొదట పూర్తిస్థాయిలో ఉపయోగించిన రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలని, అందుకు తగిన శిక్షణను ఉద్యోగులందరికీ ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐ) పాలకమండలి ఉపకమిటీ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. సంస్థ డైరెక్టర్ జనరల్(డీజీ) శాంతికుమారి సంస్థ పనితీరును తొలుత వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ శిక్షణ సంస్థగా దీనిని అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. ఈ సంస్థ స్వయం సమృద్ధితో ఆర్థికంగా పురోగతి సాధించాలని సూచించారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ పరిజ్ఞానంతో పనిచేయడం ఎలా అనే కోర్సులో శిక్షణ పూర్తిచేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు.

-2 లో

# కేటీఆర్ పగటి కలలు కంటున్నారు

- 200 మంది చెంచాలను వెంట బెట్టుకొని డ్రాములు చేస్తున్నారని విమర్శ
- పాలన విషయంలో ప్రజల మనసుల్లో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం
- బీఆర్ఎస్ చేస్తున్న వ్యతిరేక ప్రచారం విఫలం కావడం కేసీఆర్ కుటుంబం తట్టుకోలేకపోతోందని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:** కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పగటి కలలు కంటున్నారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, 200 మంది చెంచాలను వెంటబెట్టుకొని డ్రామాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

-2 లో

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోంది

- కేటీఆర్, సీఎం రమేశ్ వ్యవహారంపై స్పందించిన రఘునందన్ రావు
- వారి వ్యవహారం పార్టీలో చర్చిస్తామన్న రఘునందన్ రావు
- ఇద్దరు కేంద్ర మంత్రుల్లో ఒకరు బీసీ ఉన్నారని గుర్తు చేసిన ఎంపీ

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మధ్య చోటుచేసుకున్న పరస్పర ఆరోపణలపై తెలంగాణ బీజేపీ లోక్‌సభ సభ్యుడు రఘునందన్ రావు స్పందించారు. ఈ విషయాన్ని పార్టీలో చర్చిస్తామని ఆయన తెలిపారు. కేటీఆర్, సీఎం రమేశ్ ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎం రమేశ్‌కు చెందిన కంపెనీకి వేల కోట్ల ప్రాజెక్టును కట్టబెట్టారని కేటీఆర్

-2 లో



## టీచర్ల పదోన్నతులకు పచ్చజెండా

- మొదటి పేజీ తరువాయి

జీహెచ్ఎం స్థానాలను భర్తీ చేసేందుకు(ఆ ఖాళీల్లో 70 శాతం) ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే 630 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇస్తారు.
600 వరకు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం(పీఎస్‌హెచ్ఎం) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటిని కూడా ఎస్‌జీటీలకు పదోన్నతులిచ్చి భర్తీ చేస్తారు. పీఈటీ, భాషా పండితుల పోస్టులను కూడా గత ఏడాది జూన్‌లో స్కూల్ అసిస్టెంట్లుగా ఉన్నతీకరించారు. డీఎస్సీ 2012 తర్వాత వచ్చిన పీఈటీ, భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయలేదు. దానివల్ల దాదాపు 800 మంది వరకు మిగిలిపోయారు. ఇతరత్రా అన్నీ కూడా కలిపి మొత్తం మీద 3,500 మందికి పదోన్నతులు వస్తాయని విద్యాశాఖ వర్గాలు స్పష్టంచేశాయి. 'యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో దశల వారీ పోరాటానికి నిర్ణయించిన నేపథ్యంలోనే పదోన్నతులపై ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరం' అని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోంది

- మొదటి పేజీ తరువాయి

ఆరోపించారు. దీనిపై స్పందించిన సీఎం రమేశ్, తెలంగాణలో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేస్తాయనే భయం కేటీఆర్‌ను వెంటాడుతోందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై రఘునందన్ రావు పై విధంగా స్పందించారు.
అంతేకాకుండా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని రఘునందన్ రావు విమర్శించారు. దమ్ముంటే ఈ బిల్లుపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు. బీజేపీలో బీసీలకు ప్రాధాన్యత లేదని కాంగ్రెస్ నేతలు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉంటే అందులో ఒకరు బీసీ ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీసీలు 56 శాతం ఉంటే కేవలం ముగ్గురికే రేవంత్ రెడ్డి కేబినెట్‌లో చోటు దక్కిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూ భూముల అంశంలో కేటీఆర్ బట్ట కాల్చి తమపై వేశారని ధ్వజమెత్తారు. తనపై, కొండా విశ్వేశ్వర్ రెడ్డిపై కేటీఆర్ ఆరోపణలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏఐ వినియోగంపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలి

- మొదటి పేజీ తరువాయి

డిగ్రీ కళాశాలలు న్యాక్ గుర్తింపు పొందేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రిన్సిపాళ్లకు శిక్షణ ఇవ్వాలని, తద్వారా కేంద్రం నుంచి నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాలకు నాయకత్వం వహించే మహిళలకు జిల్లా, మండల స్థాయిలో రెండేసి రోజులపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇక నుంచి ప్రతి ఆరునెలలకు ఒకసారి ఈ సమావేశం జరుగుతుందని స్పష్టం చేశారు.

## కేటీఆర్ పగటి కలలు కంటున్నారు: చామల కిరణ్ కుమార్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్‌కు అధికారం దూరమై పద్దెనిమిది నెలలే అవుతోందని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి పాలన విషయంలో ప్రజల మనసుల్లో విషబీజాలు నాటేందుకు బీఆర్ఎస్ నాయకులు రోజుకో నాటకానికి తెరలేపుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డిపై చేస్తున్న వ్యతిరేక ప్రచారం విఫలం కావడాన్ని కేసీఆర్ కుటుంబం తట్టుకోలేకపోతోందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏమీ జరగడం లేదని చెబుతూ, తాము వచ్చాక ఏదో చేస్తామని కేటీఆర్ చెబుతున్నారని, కానీ పదేళ్ల అధికారంలో ఉండి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ చచ్చిపోయే వరకు ముఖ్యమంత్రిగా ఉండాలనే పిచ్చి భ్రమలో ఉండి, పదవి పోయాక ఫామ్ హౌస్‌లో పడుకున్నారని విమర్శించారు. 2014, 2018లలో బీఆర్ఎస్ ఇచ్చిన 70 హామీలను నెరవేర్చలేదని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కుటుంబ సభ్యుల ఫోన్లను కేటీఆర్ తప్ప ఎవరూ ట్యాప్ చేయడం లేదని విమర్శించారు. మొన్నటి వరకు మా పార్టీలో ఉన్న పాడి కౌశిక్ రెడ్డి ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరి ఎక్కువ చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డిని తిట్టడం ద్వారా బీఆర్ఎస్ నేతలు ఫేమస్ కావాలని చూస్తున్నారని మండిపడ్డారు.

# ఆటలో గెలుపు ఓటములు సహజం..
# ఓటమికి కుంగిపోకూడదు

- మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాల నుంచి బాక్సర్స్ పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆటలో గెలుపు ఓటములు సహజమని.. బాక్సర్స్ అందరికి క్రీడాస్ఫూర్తి ఉండాలని సూచించారు. ఓటమితో మన లోపాలు ఏంటో తెలుసుకుంటామని.. అందుకే ఓటమికి కుంగిపోకుండా స్పోర్టివ్?గా తీసుకోవాలని హితవు పలికారు. ప్రముఖ బాక్సర్ మొహమ్మద్ ఆలీ ఒక స్ట్రాటజీతో ఆడేవారని.. అలాగే ఇప్పుడున్న యంగ్ బాక్సర్స్ కూడా ఎవరి కొత్త స్ట్రాటజీతో వారు ముందుకు సాగాలన్నారు. తెలంగాణ బిడ్డ, బాక్సర్ నిఖత్ జరీన్ రెండు సార్లు వరల్డ్ ఛాంపియన్ అవ్వడం అందరికీ గర్వకారణమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆమెకు డీఎస్పీ ఉద్యోగంతో పాటు 600 గజాల ఇంటి స్థలం ఇచ్చి గౌరవించిందని గుర్తు చేశారు. యువ బాక్సర్లు నిఖత్ జరీన్?ను రోల్ మోడల్?గా తీసుకోవాలని సూచించారు.

## 26/7 ముంబై వరదలు: ఇరవైయేళ్ల తరువాత కూడా..
# నగరం ఇంకా వరదలకు గురవుతోంది



హైదరాబాద్ పెన్ పవర్:భారీ వర్షాల కారణంగా దేశంలో మెట్రో నగరాలు ఏటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నీట మునిగిన కాలనీ, రోడ్లు, వీధులు జలమయం, ట్రాఫిక్ గందరగోళం సర్వసాధారణం అయిపోయాయ్. ముఖ్యంగా ముంబై లాంటి మెట్రో నగరం భారీ వర్షాలకు ముంపునకు గురవుతుంది. జూలై 26, 2005 ముంబై చరిత్రలో అత్యంత చీకటి రోజు. అత్యంత విపత్కర రోజులలో ఒకటి. ఈ విపత్తు సంభవించి నేటికి 20యేళ్లు. ఇప్పుడు కూడా ముంబైలో అవే తిప్పలు.
జూలై 26, 2005న సంభవించిన వరద ముంబై నగరం ఎదుర్కొన్న అత్యంత దారుణమైన ప్రకృతి విపత్తు. ముంబైలో ఇంతటి వర్షాలు ఎప్పుడూ చూడలేదు. 600 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ముంబై నగరం 24 గంటల్లో దాదాపు 944.2 మి.మీ వర్షపాతాన్ని తట్టుకోలేకపోయింది. ఆరోజు భారతదేశ వాణిజ్య రాజధానిలో మేఘాల విస్ఫోటనం తర్వాత కురిసిన భారీ వర్షపాతంతో పాటు వచ్చిన అలలు విధ్వంసం సృష్టించాయి. వీటి జ్ఞాపకాలు ముంబైలోని ప్రతి ఒక్కరి మనస్సులో ఇప్పటికీ తాజాగా మెదులుతూనే ఉన్నాయి.
జూలై 26 ఉదయం 8 గంటల నుంచిరాత్రి 8 గంటల మధ్య ఒకే రోజు 644 మి.మీ వర్షం కురిసింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు నమోదైన 24 గంటల్లో ఇది ఎనిమిదవ అత్యంత భారీ వర్షపాతం. నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. విద్యుత్ నిలిచిపోయింది. కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ విపత్తులో వెయ్యిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 14వేల కంటే ఎక్కువ ఇళ్లు ధ్వంసమయ్యాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.
37వేల కంటే ఎక్కువ ఆటో-రిక్షాలు, 4వేల టాక్సీలు, 900 బెస్ట్ బస్సులు 10వేల ట్రక్కులు ,టెంపోలు దెబ్బతిన్నాయి. నగరం దాదాపు రూ.2వేల కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఈ విపత్తును సాధారణంగా 26/7 అని పిలుస్తారు. ఈ జూలై 26 ఆ విపత్తు సంభవించి ఇరవై యేళ్లు గడిచాయి. అయినా ముంబై నగరంలో ఇంకా అవే వరదలు, అవే మునకలు, ఏమీ మారలేదు అంటున్నారు నెటిజన్లు.
ఆ రోజును గుర్తుచేసుకుంటూ అనేక మంది సోషల్ మీడియాయూజర్లు 2005 ముంబై వరదల దృశ్యాలను పోస్ట్ చేశారు. ఈ ఘటన జరిగి 20 సంవత్సరాలు అయ్యింది.కానీ ఆ జ్ఞాపకాలు ఇప్పటికీ ఇంకా కళ్లముందు కనిపిస్తున్నాయంటూ తమ అనుభవాలను షేర్ చేస్తున్నారు.

## పాఠ్యాంశాలుగా ఆపరేషన్ సిందూర్, చంద్రయాన్, శుభాన్షు శుక్లా స్పేస్ మిషన్..




హైదరాబాద్ పెన్ పవర్:పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇండియన్ ఆర్మీ చేపట్టిన మిషన్ ఆపరేషన్ సిందూర్. 26 మంది అమాయక టూరిస్టులను పొట్టనపెట్టుకు న్నందుకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్ పాకిస్తాన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేసింది. పాక్ ఆర్మీ బేస్ లతో పాటు ఉగ్రస్థావ రాలను ధ్వంసం చేసింది ఇండియా. ఇప్పుడు ఈ ఆపరేషన్ సిందూర్ ను పాఠ్యాంశంగా చేర్చేందుకు ఎన్సీఈఆర్టీ సన్నాహాలు చేస్తోంది.
NCERT బుక్స్ లో ఆపరేషన్ సిందూర్ ను లెసన్ గా తీసుకొస్తున్నారు. పహల్గాం ఉగ్రదాడి పరిణామాలతో పాటు.. ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి విద్యార్థులకు తెలిసేలా చేసేందుకు.. అదేవిధంగా ఇండియన్ ఆర్మీ సాహసోపేతమైన ఆపరేషన్ గురించి ముందు తరాలకు తెలిసేలా 3వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సిలబస్ గా పెట్టనున్నారు. అంతేకాకుండా Mission LiFE, చంద్రయాన్, ఆదిత్యా L1, శుభాన్షు శుక్లా స్పేస్ మిషన్ మొదలైన అంశాలను పాఠ్యపుస్తకాలలో పొందుపర్చేం దుకు ప్లాన్ చేస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ నుంచి సమాచారం. ఈ అంశాలను పాఠ్యాంశాలుగా చేర్చేందుకు రెండు మాడ్యూల్స్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. మొదటిది 3-12 తరగతుల వరకు, రెండవ మాడ్యూల్ 9-12 తరగతుల వరకు. ప్రతి మాడ్యూల్ దాదాపుగా 8 నుంచి 10 పేజీల వరకు ఉంటుందని చెబుతున్నారు. ఇండియా మిలిటరీ, అంతరిక్ష ప్రయోగం తదితర అంశాలలో భారత జైత్రయాత్రలకు సంబంధించిన ముఖ్య విషయాలను ఇందులో పొందుపరిచారు. విద్యార్థులు ఇండియన్ ఆర్మీ గురించి తెలుసుకునేందుకు.. అదే విధంగా శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ చేస్తున్న కృషిని గురించి తెలుసుకుని.. ఇన్స్పైర్ అయ్యేందుకు ఈ అంశాలను పాఠ్యాంశాలుగా తీసుకొస్తున్నట్లు చెబుతున్నారు.

## సికింద్రాబాద్ లో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ నిర్వాకం.. భర్త వీర్యకణాలతో కాకుండా మరో వ్యక్తి స్పేర్మ్ తో సంతానం..



**హైదరాబాద్ పెన్ పవర్:** సంతానం కోసం దంపతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఐవీఎఫ్ అని, టెస్ట్ ట్యూబ్ బేబీ అని ,సరోగసి అని ఇలా రకరకాల పేర్లతో వెలుస్తోన్న ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ పిల్లల కోసం లక్షలకు లక్షలు ఖర్చు పెడుతున్నారు. తీరా సంతానం అవుతుందా అంటే? గ్యారంటీ ఉండదు. ఈ మధ్యనే మాదాపూర్ లోని ఓ ఐవీఎఫ్ సెంటర్ లో వైద్యుల నిర్లక్ష్యం వల్ల ఓ గర్భిణీ చనిపోయింది. ఇటీవల ఇలాంటి దారుణాలు చాలానే జరుగుతున్నాయి . లేటెస్ట్ గా సికింద్రాబాద్ లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ లో వైద్యులు ఓ మహిళకు తన భర్త వీర్యం కాకుండా మరో వ్యక్తి శుక్ర కణాలతో సంతానం కల్గించారు. దీంతో బాధిత దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. అసలేం జరిగిందంటే.? ఓ మహిళ సంతానం కోసం సికింద్రాబాద్ లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ ను ఆశ్రయించింది. తన భర్త శుక్రకణాలతో సంతానం కల్గించాలని వైద్యులను కోరింది. దీంతో డాక్టర్ దగ్గర చికిత్స తీసుకుంది. సంతానం కలిగిన తర్వాత పుట్టిన శిశువుకు క్యాన్సర్ రావడంతో అనుమానంతో డీఎన్ఏ టెస్టులు చేయించారు దంపతులు. దీంతో శిశువు డీఎన్ఏ తన భర్త డీఎన్ఏతో మ్యాచ్ కాకపోవడంతో బాధిత దంపతులు గోపాలపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జులై 26న వైద్యశాఖ రెవెన్యూ అధికారులతో కలిసి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లో తనిఖీలు చేపట్టారు. అనుమతులను పరిశీలించడంతో పాటు గతంలో కూడా ఇదే తరహాలో మోసం చేసిన కేసులు ఉన్నట్లు గుర్తించారు . ఎంత మందికి ఇలా ట్రీట్ మెంట్ ఇచ్చారు అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పార్టీ కార్యకర్తపై చేయి చేసుకున్న కేటీఆర్... భద్రతా సిబ్బందిని వారించిన పాడి కౌశిక్ రెడ్డి!



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ అనుబంధ విభాగం బీఆర్ఎస్వీ కార్యకర్తపై చేయి చేసుకున్నారు! ఈ రోజు ఉప్పల్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి తెలంగాణ విద్యార్థి విభాగం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కేటీఆర్, పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి వేదికపైకి నడుచుకుంటూ వెళుతుండగా ఒక కార్యకర్త ఆయనకు ఎదురుగా వచ్చారు. అయితే, అక్కడ ఏం జరిగిందో స్పష్టంగా తెలియదు కానీ, కేటీఆర్ తన ముందున్న కార్యకర్త తలపై చేయితో పక్కకు నెట్టేశారు. ఆ తర్వాత పక్కనే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది కూడా అతడిని పక్కకు లాగారు. కౌశిక్ రెడ్డి, ఇతర నాయకులు అతడిని అక్కడి నుంచి దూరంగా పంపించే ప్రయత్నం చేశారు. సెక్యూరిటీ సిబ్బంది అతడిని నెట్టివేస్తుండగా కౌశిక్ రెడ్డి వారించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

# జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు.. ఆయన సహకారం ఎప్పటికీ మరువలేం: CM రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దివంగత నేత జైపాల్ రెడ్డి పాత్ర ఎన్నటికీ మరువలేనిదని, ఆయన సహకారం లేకుంటే ప్రృతేక రాష్ట్రం వచ్చేది కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆయన సమయస్ఫూర్తి ఎంతో పనికొచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జైపాల్ రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియా గాంధీ కూడా ఓసారి చెప్పారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. శనివారం (జూలై 26) హైదరాబాద్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ, %×జఖీూ×% నిర్వహించిన ఎస్. జైపాల్ రెడ్డి స్మారక అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ ఆర్థిక నిపుణులు మోహన్ గురుస్వామికి జైపాల్ రెడ్డి డెమెక్రసీ తొలి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. జైపాల్ రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో ఆయన 40 ఏళ్ల పాటు అజాతశత్రువుగా ఉన్నారని కొనియాడారు. సమాచార హక్కు చట్టం రావడంలో జైపాల్ రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు. సంస్కరణల అమలుకు జైపాల్ రెడ్డి ఎంతో తాపత్రయపడేవారన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం జైపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు.

తెలంగాణ నుంచి పీవీ నర్సింహా రావు తర్వాత అంత పేరు తెచ్చుకున్నది జైపాల్ రెడ్డి మాత్రమేనన్నారు. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని జైపాల్ రెడ్డి చెప్తుండేవారని ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని మేం ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయాలకంటే సిద్ధాంతపరమైన రాజకీయాలు ముఖ్యమన్నారు. ప్రస్తుతం ఐడియోలాజికల్ పాలిటిక్స్ పోయి స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని.. సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసేవాళ్లు దేశ రాజకీయాల్లో తగ్గుతూ వస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభిప్రాయపడ్డారు. యూనివర్శిల నుంచే సిద్ధాంతపరమైన రాజకీయాలు తయారు అవుతాయని పేర్కొన్నారు.

# అలాంటి ప్రభుత్వానికి మద్దతు బాధగా ఉంది..నితీష్‌పై చిరాగ్ పాశ్వాన్ ఫైర్





**హైదరాబాద్ పెన్ పవర్:** బీహార్ లో నితీష్ కుమార్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా నశించాయి.. నేరాల నియంత్రణలో నితీష్ కుమార్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం చాలా బాధగా ఉందని అన్నారు.

రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా మారింది.. పరిపాలనా వైఫల్యానికి అధికారుల అసమర్థత,నేరస్థులతో కుమ్మక్కవడమే కారణమని అన్నారు చిరాగ్ పాశ్వాన్. "ఇటీవల హింసాత్మక నేరాలు పెరగడానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికలతో సంబంధం ఉందని, ఈ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నా యని, అయినప్పటికీ, శాంతిభద్రతలను అదుపులో ఉంచడం పరిపాలన బాధ్యత. ఈ విషయంలో విఫలమవుతున్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం నాకు బాధగా ఉంది" అని చిరాగ్ పాశ్వాన్ అన్నారు. చిరాగ్ నితీష్‌ను విమర్శించడం ఇదే మొదటిసారి కాదు. 2020లో బీహార్‌లో జరిగిన మునుపటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో, చిరాగ్ కూడా అలాగే ఆరోపణలు చేశారు. జనతాదళ్-యునైటెడ్ (జెడి-యు)కి నితీష్ కి వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టాడు. ఈసారి కూడా ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్ ఎన్నికల్లో పోటీ చేయాలని చిరాగ్ సూచించాడని తెలుస్తోంది. బీహార్ లో అత్యాచారం, హత్య, కిడ్నాప్ ,దోపిడీ వంటి సంఘటనలు వరసగా జరుగుతున్నాయి.. అయినా పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో రాష్ట్ర అధికారులు ఘోరంగా విఫలమయ్యారని అన్నారు. శాంతిభద్రతలు కుప్పకూలిపోయాయి.. పరిస్థితి దాదాపు అదుపు తప్పింది.. వెంటనే లా అండ్ ఆర్డర్ చక్కదిద్దాల్సిన అవసరం ఉందన్నారు చిరాగ్ పాశ్వాన్.

# ఇక వారందరికీ గుడ్ న్యూస్.. ఆగస్టు నెల నుంచే వారికి కొత్త పింఛన్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పనుంది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అర్హులైనవారికి పెన్షన్ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆగస్టు నుంచి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1,99,155 మందికి పెన్షన్ ఇచ్చేందుకు అధికారులు అంతా సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల చి దాదాపు లక్షమందికి పైగా పెన్షన్లు ఇవ్వనున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు పెన్షన్ అందని వారు లబ్ధిదారులుగా పేరును నమోదు చేసుకోవచ్చు. ఆంధ్ర ప్రదేశ్ కూటమి ప్రభుత్వం పెన్షన్ దారులకు తీపికబురును చెప్పేందుకు సిద్ధమయింది. గత ప్రభుత్వం అనర్హులుగా భావించి తొలగించిన వారు కూడా అర్హత ఉంటే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది.




**భర్తలు చనిపోతే...**

ఎవరైనా పెన్షన్ పొందుతున్న భర్తలు చనిపోతే, వారి భార్యలు ఈ పెన్షన్లను పొందడానికి అర్హులు. గతంలో కూడా ఇలాంటి వితంతు పెన్షన్లు ఇచ్చారు. కాదంటే ఇంకా చాలామంది కొత్తవారు ఉండిపోయారు. వారికోసమే ప్రభుత్వం ఇపుడు ఈ నిర్ణయం తీసుకుందని మంత్రులు చెబుతన్నురు. భర్త చనిపోతే కచ్చితంగా భార్యకు పెన్షన్ ఇవ్వాలనే ఆలోచనతో ఈ కొత్త కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ప్రతినెలా ఇలా కొత్తగా చనిపోతున్నవారి జాబితాని సేకరించి, వారి భార్యలను ఈ కొత్త పెన్షన్ల జాబితాలో చేర్చనున్నారు. వారికి పెన్సన్ వచ్చేలా చేస్తారు. ఆగస్టులో మొదలైన ఈ పెన్షన్ల కింద, ఒక్కొక్కరికి నెలకు నాలుగు వేల రూపాయలు చొప్పున ఇస్తారు. ఇలా ఈ అదనపు వితంతు పెన్షన్ల కోసం రూ.43.66 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించింది.

**అర్హులైనవారందరికీ...**

ఆంధ్రప్రదేశ్ లో అర్హులైనవారందరికీ పెన్షన్ అందడం లేదని కూటమి ప్రభుత్వం గుర్తించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం కూటమి ప్రభుత్వం సర్వేలు జరిపి, జాబితాను సిద్ధం చేసింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో పెన్షన్ తీసుకునేవారి సంఖ్య 62,81,768 మంది ఉన్నారు. అయితే ఇందులో కొంతమంది చనిపోయినవారు, మిస్సింగ్ అయినవారు, విదేశాలకు వెళ్లిపోయినవారు, అందుబాటులో లేని వారు, అనర్హులు దాదాపు మూడు లక్షలకు పైనే ఉన్నట్టు కూటమి ప్రభుత్వం చెబుతుంది. వీరందరినీ ఇప్పుడు పెన్షన్ లిస్ట్‌లోంచి తొలగించి ఆ డబ్బులను ఇప్పుడు వింతతు పెన్షన్ల కింద ఇవ్వాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది. దీంతో ఆంధ్రప్రదేశ్ లో నివాసముంటూ అర్హత కలిగిన వారికి పింఛన్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది.

## కురుస్తూనే ఉన్న వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో భారీ వర్షం రాత్రి నుంచి కురుస్తూనే ఉంది. నగరం తడిసి ముద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం, వాయుగుండంగా మారి తర్వాత వాయవ్య బంగళాఖాతంలోకి ప్రవేశించడంతో నిన్నటి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ వాతావరణ శాఖ కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా హైదరాబాద్ లో గత ఐదు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు జనం.

**చిన్నపాటి వర్షం పడితేనే...**

హైదరాబాద్ లో చిన్న పాటి వర్షం పడితేనే నగర రహదారులన్నీ జలమయమవుతాయి. అలాంటి పరిస్థితుల్లో ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రహదారులు చెరువుల్లా మారిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చలిగాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉంది. విద్యుత్తు వినియోగం గణనీయంగా తగ్గిందని విద్యుత్తు శాఖ అధికారులు చెబుతున్నారు. నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి నగరంలోని అనేక ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

**ముఖ్యమంత్రి ఆదేశాలతో...**


హుస్సేన్ సాగర్ కూడా నిండుకుండను తలపిస్తుంది. విధులకు వెళ్లాల్సిన ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు ముందుగానే సెలవులు ప్రకటించాయి. ప్రభుత్వం కూడా అప్రమత్తమయింది. జీహెచ్ఎంసీ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుని ఎక్కడా వరద నీరు నిల్వకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు అలెర్ట్ అయ్యారు.

## సికింద్రాబాద్‌లో వీర్యం నిల్వ చేసిన డాక్టర్ అరెస్ట్




**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్‌లోని ఓ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో అక్రమాలు వెలుగు చూశాయి. శనివారం పోలీసుల నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. ఒక మహిళ తన భర్త వీర్య కణాల ద్వారా సంతానం పొందాలనే ఆశతో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఆశ్రయించింది. అయితే, వైద్యులు వేరే వ్యక్తి వీర్యకణాలతో ఆమెకు గర్భం కలిగించారు. అనుమానం వచ్చిన దంపతులు డీఎన్ఏ పరీక్ష చేయుంచగా, అది వేరే వ్యక్తి డీఎన్ఏగా తేలింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన పోలీసులు శనివారం ఆ టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, డాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. సరోగసి కోసం పెద్ద ఎత్తున వీర్యాన్ని నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. వీర్య సేకరణలో అక్రమ పద్ధతులు అవలంబిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. డాక్టర్‌తో పాటు ఆ సెంటర్‌లో పనిచేస్తున్న మరో ఏడుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## జాగ్రత్త! ఆ ఫేమస్ రెస్టారెంట్ చికెన్ కబాబ్స్ సేఫ్ కాదు...






**హైదరాబాద్ పెన్ పవర్:**చికన్ అనగానే కొందరికి నోరూరుతుంటుంది. నాన్ వెజ్ ప్రియుల గురించి ఇంకా చెప్పనక్కరలేదు. అయితే మనం తినే ఫుడ్ ఎంత ఆరోగ్యమైదో ఎప్పుడైనా ఆలోచించారా... ఫేమస్ రెస్టారెంట్ అంటూ క్యూలో నిలబడి మరి కొంటుంటాం, మరి అలాంటప్పుడు ఈ రెస్టారెంట్లో ఇచ్చే చికన్ ఐటమ్స్ మనుషులకి ప్రమాదకరం అని తెలితే ఏం చేస్తారు...

బెంగళూరులోని గాంధీనగర్‌లో ఇదే జరిగింది. బెంగళూరులో ప్రముఖ రెస్టారెంట్ అయిన ఎంపైర్ రెస్టారెంట్ పై స్టేట్ ఫుడ్ లాబొరేటరీ, పబ్లిక్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ చేసిన ల్యాబ్ రిపోర్ట్ ప్రకారం ఇందులో తయారు చేసే చికెన్ కబాబ్‌లు మనుషులు తినడానికి సురక్షితం కాదని ప్రకటించింది. వివరాలు చూస్తే జూన్ 27న బెంగళూరులోని ఆనంద్ రావు సర్కిల్ దగ్గరలో ఉన్న ఎంపైర్ రెస్టారెంట్ నుండి 2 కిలోల చికెన్ కబాబ్ సాంపుల్స్ అంటే ఒక్కొక్కటి 500 గ్రాముల నాలుగు ప్యాకెట్లను సేకరించిన ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంబరీష్ గౌడ తనిఖీల తర్వాత ఆహార భద్రత గురించి ఆందోళను మొదలయ్యాయి. అయితే సాంపుల్స్ టెస్టింగ్ కోసం పంపించాక జూలై 11న వచ్చిన రిపోర్టులో చికెన్ కబాబ్‌లు ఆహార ఉత్పత్తి ప్రమాణాల నిబంధనలు 2011 కింద పేర్కొన్న అవసరమైన భద్రతా ప్రమాణాలను అందుకోలేదని తేలింది. దింతో ఆహార భద్రత %డ% ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఎంపైర్ రెస్టారెంట్ చికెన్ కబాబ్‌లు సురక్షితం కాదని తేలింది. దింతో BBMP ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (నార్త్ జోన్) ఎంపైర్ రెస్టారెంట్‌కు నోటీసు జారీ చేసింది, అలాగే దీనిపై సమాధానం ఇవ్వాలని 30 రోజుల టైం ఇచ్చింది. మరోవైపు మైసూరులోని CFTRIలో ఫుడ్ సాంపుల్స్ తిరిగి టెస్టింగ్ కోసం కోరొచ్చని కానీ స్వంత ఖర్చుతో మాత్రమే అని రెస్టారెంట్‌కు తెలిపింది.

FSSAI జారీ చేసిన నోటీసు మాకు అందింది. ఈ సమస్య పై మేము ఇప్పుడేం మాట్లాడలేము, మా కబాబ్‌లలో ఫుడ్ కలరింగ్ వాడటం మానేశామని నేను ఖచ్చితంగా చెప్పగలను అని ఎంపైర్ చైన్ ఆఫ్ రెస్టారెంట్ల CEO షకీర్ అన్నారు.


# గూగుల్ మ్యాప్ మళ్లీ ముంచేసింది.. రూట్ మ్యాప్ చూసుకుంటూ వెళ్లిన మహిళ.. చివరికి నీళ్లలో తేలింది

రూట్ మ్యాప్ లు ఎప్పుడు ఎవర్ని ఎక్కడ పడేస్తాయో.. ఎక్కడ ముంచేస్తాయో అర్థం కాని పరిస్థితి. ఎక్కడికెళ్లాలన్నా.. రూట్ తెలియకపోతేనేం.. గూగుల్ మ్యాప్ ఉంది కదా అనే ధీమాలో వెళ్లే వారికి షాకుల మీద షాక్ లు ఇస్తున్నాయి రూట్ మ్యాప్ యాప్ లు. మొన్నామధ్య ఉత్తరప్రదేశ్ లో గూగుల్ మ్యాప్ ను నమ్మి బ్రిడ్జిపై వేగంగా వెళ్లి.. కారు బ్రిడిజైనుంచి పడిపోవడంతో ముగ్గురు చనిపోయారు. ఇటీవల హైదరాబాద్ టూరిస్ట్ కారు గూగుల్ మ్యాప్ ను నమ్మి కేరళలో ఓ పెద్ద గుంతలో పడిపోయింది. ఇలాంటి ఇన్సిడెంట్స్ మరువక ముందే ముంబైలో జరిగిన మరో ఘటన సంచలనంగా మారింది.

నవీ ముంబైలో ఓ మహిళ గూగుల్ మ్యాప్ ను నమ్మి కారుతో సహా నీళ్ల గుంతలో పడిపోయింది. పొద్దుపొద్దున్నే మ్యాప్ ఆన్ చేసుకుని బయల్దేరిన మహిళ.. ఒక్కసారిగా నీటి గుంతలో పడిపోవడం అధికారులను ఆందోళనకు గురి చేసింది. నవీ ముంబై లోని బేలాపూర్ టు ఉల్వే రూట్ లో జరిగింది ఈ షాకింగ్ ఇన్సిడెంట్.

బేలాపూర్ లోని సముద్ర తీర బ్రిడ్జికి వెళ్లాల్సిన మహిళను మ్యాప్ బ్రిడ్జికిందంగా చూపిస్తూ ధృవతార జెట్టీ రూట్ లో చివరికి నీళ్లల్లోకి తీసుకెళ్లింది. రూట్ తెలియకపోవడంతో మ్యాప్ ను అనుసరించిన మహిళ చివరికి నీళ్లలో పడిపోయింది.

సమీపంలో ఉన్న సముద్ర భద్రతా అధికారులు.. వెంటనే స్పందించి ఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ మహిళ నీళ్లలో తేలియాడుతుండటం చూసి ముందుగా ఆమెను కాపాడారు. ఆ తర్వాత క్రేన్ ల సహాయంతో కార్ ను బయటకు తీశారు. ఆమెకు ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. నీళ్ల గుంతలో పడిన వైట్ కార్ ను క్రేన్ సహాయంతో బయటకు తీస్తున్న విజువల్స్ వీడియోలో చూడవచ్చు. గూగుల్ మ్యాప్ ను నమ్ముకుని ప్రమాదాలు జరగటం ఇది మొదటిసారి కాదు. ఆ మధ్య ఉత్తరప్రదేశ్ లో మ్యాప్స్ ఆధారంగా నిర్మాణం పూర్తి కాని బ్రిడ్జిపైకి వెళ్లి నీళ్లలో పడిపోయారు. బదౌన్ జిల్లాలో బరేలీ నుంచి దాతగంజ్ వెళ్తుండగా జరిగింది ఆ ప్రమాదం. హైదరాబాద్ టూరిస్టులు కూడా అలాంటి ప్రమాదంలోనే కేరళలో పడిపోయారు. ప్రమాదానికి చింతిస్తున్నాం.. మరింత కచ్చితంగా మ్యాప్ ను తయారు చేస్తామనిగూగుల్ సంస్థ చెబుతున్నప్పటికీ



తరచుగా ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది.

**గూగుల్ మ్యాప్స్ ఉపయోగించేవారికి నిపుణుల సూచనలు:**

తరచుగా ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో గూగుల్ మ్యాప్స్ ఉపయోగించేవారికి టెక్ నిపుణులు కీలక సూచనలు చేశారు. గుడ్డిగా గూగుల్ మ్యాప్స్ నమ్మకుండా కొన్ని టిప్స్?తో గూగుల్ మ్యాప్ వల్లే జరిగే ప్రమాదాలను అరికట్టవచ్చని అంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం మరీ మనం కూడా.

1. గూగుల్ మ్యాప్స్ ఉపయోగించే ముందు మీ స్మార్ట్‌ఫోన్‌లో గూగుల్స్ మ్యాప్స్?ని అప్‌డేట్ చేసుకోండి. గడువు ముగిసిన మ్యాప్‌లు కొన్నిసార్లు తప్పుడు సమాచారాన్ని సూచిస్తాయి. కాబట్టి.. ఎప్పటికప్పుడు గూగుల్ మ్యాప్స్?ను అప్‌డేట్ చేసుకోవడం ఉత్తమం. కంపెనీ తీసుకొచ్చే లేటెస్ట్ ఫీచర్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవడం ద్వారా మ్యాప్స్ సరైన లక్ష్యాన్ని సూచిస్తాయి.
2. గూగుల్ మ్యాప్స్ ఉపయోగించే సమయంలో మనం వెళ్లాల్సిన రూట్ స్పష్టంగా అర్థం కాకపోతే వెంటనే స్థానికులను అడిగి తెలుసుకోండి. ఎందుకంటే మ్యాప్ ఎప్పుడు ప్రస్తుత రహదారి పరిస్థితులను సూచించకపోవచ్చు.

# అచ్చంపేట .. అనిరుధ్ మామూలోడు కాదు.. ఐదు కోట్లకు టోకరా వేశాడుగా?




తెలంగాణకు చెందిన అనిరుధ్ అనే యువకుడు దేశంలో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాడు. అతని కోసం అనేక రాష్ట్రాలకు చెందిన పోలీసులు వేట కొనసాగిస్తున్నారు. నాగర్ కర్నూలు జిల్లాలోని అచ్చంపేట పట్టణానికి చెందిన అనిరుధ్ దేశంలోని అన్ని ప్రాంతాలకు తిరుగుతూ ఆన్ లైన్ మోసాలకు పాల్పడుతున్నారు బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల్లో తిరుగుతూ అమయాకులైన వారి నుంచి డబ్బులు దండుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

**అనేక రాష్ట్రాల్లో సైబర్ క్రైమ్ కు పాల్పడి...**

దాదాపు ఐదు కోట్ల రూపాయల మేరకు సైబర్ క్రైమ్ కు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పూణె, కర్ణాటక, తమిళనాడుల్లోనూ అనిరుధ్ పై అనేక కేసులు నమోదయ్యాయి. అన్ లైన్ లో లింకులు పంపించడం, వారిని మభ్య పెట్టి డబ్బులు గుంజడం వంటివి అనిరుధ్ చేస్తాడు. డబ్బులు తన అకౌంట్ లోపడిన వెంటనే అక్కడి నుంచి బిచాణా ఎత్తేస్తాడు. అనేక రాష్ట్రాల పోలీసులకు అనిరుధ్ సవాల్ గా మారాడు. అనేక చోట్ల తిరుగుతూ పోలీసుల కన్నుగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు.

**బీహార్ పోలీసులు వచ్చి...**

అయితే తాజాగా అనిరుధ్ కోసం బీహార్ పోలీసులు వచ్చారు. ఆన్ లైన్ లో లింకులు పంపించి రెండు కోట్ల రూపాయలు స్వాహా చేసిన ఘటనలో ఇటీవలబీహార్ పోలీసులు అనిరుధ్ పై కేసు నమోదు చేశారు. దీంతో అనిరుధ్ స్వస్థలం నాగర్ కర్నూలు జిల్లా అని తెలుసుకుని అక్కడికి బీహార్ పోలీసులు వచ్చారు. అచ్చంపేట పోలీసుల సహకరాంతో నిందితుడు అనిరుధ్ ఇంటికి వెళ్లి బీహార్ పోలీసులు వివరాలు సేకరించారు. అయితే అనిరుధ్ ఒక్కడే ఈ సైబర్ క్రైమ్ కు పాల్పడుతున్నాడా? మరేదైనా గ్యాంగ్ ఇతని వెనక ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అనిరుధ్ కోసం పోలీసులు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుంటున్నారు. వారి ఫోన్ నెంబర్లను కూడా తీసుకుని పరిశీలించారని తెలిసింది.

# ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం.. అలెర్ట్ గా ఉండాల్సిందే




బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలలో పడతాయని పేర్కొంది. ఆదివారం వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాయలసీమ, కోస్తా జిల్లాలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. సముద్రం అలజడిగా ఉంటుందని, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తీరాల్లో అలలు 2.9 నుంచి 3.6 మీటర్ల ఎత్తులో ఎగసిపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

**మత్స్యకారులు చేపలవేటకు...**

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం అప్రమత్తమయింది. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని సూచించింది. వర్షాలు, ఫ్లాష్ ఫ్లడ్ ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రమాద హాట్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించింది. అత్యవసర సహాయక చర్యలకు కంట్రోల్ రూమ్ లో 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసింది. కోస్తా తీర ప్రాంతంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అలెర్ట్ గా ఉండాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను కూడా సిద్ధంగా ఉంచాలని కూడా ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

**రానున్న నాలుగు రోజులు...**

తెలంగాణలోనూ రానున్న నాలుగు రోజుల పాటు తేలిక పాటి నుంచి భారీ వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడతాయని చెప్పింది. బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ చెప్పింది.కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లో నేడు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## రేవంత్ రెడ్డిపై వ్యాఖ్యలు.. పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ నేత తీవ్ర ఆగ్రహం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి ఆగ్రహం
- కౌశిక్ రెడ్డి ఏమ మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని మండిపాటు
- రోజుకు పద్దెనిమిది గంటలు తమ ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్య



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తీవ్రంగా స్పందించారు. కౌశిక్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, ఆయనకు మతి భ్రమించిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రులు ఏ విధంగా పనిచేస్తున్నారో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు. రోజుకు పద్దెనిమిది గంటలు పనిచేస్తోన్న ప్రభుత్వం తమదని అన్నారు. కౌశిక్ రెడ్డి నోటిని అదుపులో పెట్టుకోకపోతే సన్నబియ్యం తినే ప్రజలే ఆయనను కొడతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఉచిత బస్సు ఎక్కే మహిళలు ఊరుకోరని ఆయన అన్నారు. ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వారి ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమిటని ఆయన నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ పాపం కేటీఆర్‌దేనని ఆరోపించారు. మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎంత గౌరవం ఉందో అందరికీ తెలుసని అన్నారు.

## మరో రెండు గంటల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయి: రాజస్థాన్ సీఎంవో, జైపూర్ విమానాశ్రయానికి బెదిరింపు




హైదరాబాద్ పెన్ పవర్:రాజస్థాన్ ముఖ్యమంత్రి కార్యాలయానికి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కలకలం రేగింది. ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు జైపూర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ-మెయిల్ ద్వారా ఈ బెదిరింపు వచ్చినట్లు వారు పేర్కొన్నారు.గంట లేదా రెండు గంటల్లో ముఖ్యమంత్రి కార్యాలయం, విమానాశ్రయంలో బాంబు పేలుళ్లు సంభవిస్తాయని, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలంటూ ఆ మెయిల్స్‌లో దుండగులు హెచ్చరించారు.బాంబు బెదిరింపుల నేపథ్యంలో భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. ముఖ్యమంత్రి కార్యాలయం, విమానాశ్రయంలో యాంటీ బాంబు స్క్వాడ్, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే, రెండు చోట్ల ఎలాంటి అనుమానాస్పద వస్తువుల లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# కుండపోత వర్షం... వాతావరణ శాఖ హైఅలెర్ట్

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో మరికొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. హైదరాబాద్ వాసులకు కూడా భారీ వర్ష సూచన చేసింది. ఈ మేరకు కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతవరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. వాయుగుండం ప్రభావంతో హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణాలోని కొన్ని జిల్లాలకు భారీ వర్షం పడుతుందని తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురుస్తుందని, సాఫ్ట్ వేర్ కంపెనీల ఉద్యోగులు ముందుగానే కార్యాలయాల నుంచి బయలుదేరి ఇళ్లకు చేరుకుంటే మంచిదని పోలీసు అధికారులు చెబుతున్నారు.




**గత నాలుగు రోజుల నుంచి...**

హైదరాబాద్ లో గత నాలుగు రోజుల నుంచి సాయంత్రం వేళకు భారీ వర్షం కురుస్తుంది. రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అనేక చోట్ల రోడ్లపై నీరు నిలిచి పోవడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఎక్కడి వాహనాలు అక్కడే గంటల కొద్దీ ట్రాఫిక్ లో నిలిచిపోతున్నాయి. మాదాపూర్ లో సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరిన ఉద్యోగులు రాత్రి తొమ్మిది గంటలకు కూడా ఇళ్లకు చేరుకోలేని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల క్రితం ప్యారడైజ్ కాలనీ, పైగా కాలనీల్లో వరద నీరు ఇంట్లోకి చేరుకోవడతో వస్తువులన్నీ నీటిలో తడిసి పోయాయి. దీంతో అనేక మంది ఇబ్బందులు పడ్డారు. నాలాలు పొంగి ప్రవహిస్తుండటంతో వరద నీటితో కలిసి మురుగు నీరు కూడా ఇళ్లలో చేరి దుర్గంధం నెలకొంది.

**ఇళ్ల నుంచి బయటకు రావద్దని...**

దీంతో దోమల బెడద కూడా హైదరాబాద్ లో తీవ్రమయింది. ఈ పరిస్థితులతో హైదరాబాద్ నగరంలో డెంగ్యూ వ్యాధి కూడా ప్రబలుతుంది. అనేకమంది డెంగూ వ్యాధితో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో పాటు వైరల్ ఫీవర్స్ తో పాటు జలుబు, దగ్గు వంటి లక్షణాలతో ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్లుగా చేరుతున్నారు. గత నాలుగు రోజుల నుంచి వర్షం వీడకపోతే హైదరాబాద్ నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి ఆకాశం కారు మబ్బులు కమ్ముకుని కారు చీకట్లు అలుముకుంటున్నాయి. చలి వాతావారణం నెలకొని ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# నదులకు భారీగా వరద నీరు... పుకార్లను నమ్మవద్దంటూ ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు
- గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు వరద నీరు
- దిగువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు



హైదరాబాద్ పెన్ పవర్:నైరుతి రుతుపవనాల కారణంగా కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అలర్ట్ జారీ చేసింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోందని తెలిపింది. వరద ప్రవాహం ఇంకా హెచ్చరిక స్థాయిని చేరలేదని, అయినప్పటికీ దిగువకు నీటిని విడుదల చేస్తున్నందున ఆయా నదుల పరీవాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు, లోతట్టు ప్రాంతాల్లో ఉండే వారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని స్పష్టం చేసింది. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయరాదని హెచ్చరించింది. కాగా, రాత్రి 7 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 35.3 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద ఇన్ ఫ్లో 4.44 లక్షల క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో కూడా అదే స్థాయిలో 4.44 లక్షల క్యూసెక్కులుగా ఉంది. అటు, తుంగభద్ర నదిలోనూ 40 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో ప్రభావిత జిల్లాల్లోని మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు.

వర్ష సూచన: ఏపీలోని పలు జిల్లాలకు ఏపీఎస్డీఎంఏ వర్ష సూచన చేసింది. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, విశాఖ, విజయనగరం జిల్లాల్లో రేపు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగతా చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది.

# దేశంలో స్విగ్గీ పాలిటిక్స్ తెరపైకొచ్చాయ్.. ప్రజాస్వామ్యానికి ఇవి చాలా డేంజర్:





**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో సిద్ధాంతపరమైన రాజకీయాలు కాకుండా ఎవరెంత వేగంగా డెలివరీ చేస్తారన్న 'స్విగ్గీ పాలిటిక్స్' తెరమీదకొచ్చాయని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర పరిణామమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం (జూలై 26) హైదరాబాద్‌లో క్యాపిటల్ ఫౌండేషన్ సొసైటీ, ICFAI సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి పేరిట నెలకొల్పిన స్మారక అవార్డును ప్రముఖ రచయిత, మోహన్ గురుస్వామికి అందించారు సీఎం రేవంత్.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో ధన ప్రభావం పెరిగి ప్రజాస్వామిక స్ఫూర్తికి ప్రమాదకర పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధన ప్రభావం తగ్గి విలువలతో కూడిన సిద్ధాంతపరమైన రాజకీయాలు ఉండాలని చెప్పారు. సిద్ధాంతపరమైన రాజకీయాలకు సిద్ధాంతాలను నమ్మేవారు, పాటించేవారు, సిద్ధాంతాల కోసమే పనిచేసే వాళ్లు దేశ రాజకీయాల్లో తగ్గుతూ వస్తున్నారు. ఇది దేశానికి, ప్రజాస్వామిక స్ఫూర్తికి ప్రమాదకరం. దేశం వేగంగా ప్రమాదం వైపు పయనిస్తుంది.

ప్రజాస్వామిక విలువలు తగ్గి పొలిటికల్ మేనేజ్‌మెంట్లు, పొలిటికల్ మేనేజర్స్ ఎక్కువయ్యారు. కార్యకర్తలు పోయి వాలంటీర్స్ వచ్చారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరం. యూనివర్సిటీల్లో సిద్ధాంతపరమైన విద్యార్థి రాజకీయాలు రావలసిన అవసరం ఉంది. దేశ రాజకీయాల్లో ధన ప్రభావం తగ్గాలి. వ్యక్తిగత రాజకీయాలకంటే సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు ఉండే రాజకీయాలు ప్రజాస్వామిక విలువలను కాపాడుతుంది. రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు, జైపాల్ రెడ్డి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలి. వారి స్ఫూర్తితో అభివృద్ధి, సంక్షేమాన్ని సమతూకం చేసుకుంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తాం" అని అన్నారు.

"జైపాల్ రెడ్డి విద్యార్థి నాయకుడిగా, శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా.. వివిధ హోదాల్లో ప్రాతినిధ్యం వహించి సుదీర్ఘంగా సిద్ధాంతపరమైన రాజకీయాలు చేశారు. 1984 లో పార్లమెంట్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి 35 ఏళ్లు వెనుదిరిగి చూడకుండా దేశ రాజకీయాల్లో రాణించారు.

1969 లో అడుగుపెట్టి 50 సంవత్సరాలు 2019 చివరి శ్వాస వరకు ప్రజల పక్షాన, ప్రజా సమస్యల పరిష్కారానికి, దేశ విధివిధానాలను అమలు చేయడంలోనే కృషి చేశారు. పెట్రోలియం శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న కీలక నిర్ణయాలు, అలాగే సమాచార శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రసార భారత చట్టాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష గళాన్ని వినిపించే విధంగా ఒక బలమైన చట్టాన్ని తీసుకొచ్చారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు, పత్రికలకు కీలకమైన పాత్ర పోషించే అవకాశం కల్పించారు. తెలంగాణ నుంచి దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి బలమైన ముద్ర వేశారు.

జైపాల్ రెడ్డికి రాజకీయ ప్రత్యర్థులే గానీ శత్రువులు ఎవరూ లేరు. సిద్ధాంతపరమైన రాజకీయాలే తప్ప ఆయన ఏనాడూ పదవులను ఆశించలేదు. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకుని ఈ ప్రాంతానికే గౌరవం తీసుకొచ్చారు. తెలంగాణ నుంచి గొప్పగా రాణించిన స్వర్గీయ పీవీ నరసింహారావు తర్వాత జైపాల్ రెడ్డి చట్ట సభల్లో ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చారు. ఈరోజు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర విస్మరించలేనిది. ఆయన లేకపోతే తెలంగాణ వచ్చి ఉండేది కాదు. ఆయన సమయస్ఫూర్తి, అనుభవం, ఉభయ సభల్లో బిల్లును ఆమోదింప జేయడంలో అత్యంత కీలక పాత్ర పోషించారు. రాజ్యసభలో సవరణలు ప్రతిపాదించినప్పుడు గాని, కేంద్ర కేబినేట్‌లో గాని జైపాల్ రెడ్డి చూపించిన చొరవ మరువలేనిదని కొనియాడారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు

- సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు
- కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేసిన రాజేంద్ర నగర్ పోలీసులు
- రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** హుజురాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై రాజేంద్ర నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు.

దీంతో ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి.. కౌశిక్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇక, నిన్న సీఎంపై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీంతో కౌశిక్ రెడ్డి నివాసానికి ఆయన మద్దతుదారులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాడి చేస్తే అడ్డుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ కార్యకర్తలు చెబుతున్నారు. కాగా, ఆయన ఇంటిపై ఏ క్షణమైన దాడి జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు మోహరించారు.

## రష్యా చమురుపై ఈయూ ఆంక్షలు... భారతీయ షిప్పింగ్ కంపెనీలపై ఎఫెక్ట్



యూరోపియన్ యూనియన్ (ఈయూ) రష్యా చమురుపై విధించిన ఆంక్షలు భారతీయ షిప్పింగ్ కంపెనీలపైనా, భారతీయ నౌకా కెప్టెన్లపైనా ప్రభావం చూపుతున్నాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కి చెందిన ఇంటర్‌షిప్పింగ్ సర్వీసెస్ హబ్ అనే షిప్పింగ్ కంపెనీకి చెందిన భారతీయ విభాగం ఈ ఆంక్షల వల్ల ప్రభావితమైంది. అంతేకాకుండా, క్రూడ్ ఆయిల్ ట్యాంకర్ కెప్టెన్ అభినవ్ కమల్‌పై కూడా ఈ ఆంక్షలు దెబ్బ పడింది. రష్యా క్రూడ్ ఆయిల్ లేదా పెట్రోలియం ఉత్పత్తులను రవాణా చేసే నౌకలకు కెప్టెన్ అభినవ్ కమల్ మెటీరియల్, సాంకేతిక మరియు ఆర్థిక సహాయం అందించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి ఈయూ ఆంక్షలు ఎదుర్కొన్న ఏకైక భారతీయ పౌరుడు ఆయనే. ఇక, ఇంటర్‌షిప్పింగ్ సర్వీసెస్ హబ్ సంస్థ రష్యన్ వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొన్న నౌకలకు ఆశ్రయం కల్పించిందని ఆరోపణలు ఎదుర్కొంటోంది. యూరోపియన్ యూనియనేతర సంస్థలు ఇప్పటికీ ఇంటర్‌షిప్పింగ్ సర్వీసెస్ హబ్‌తో వ్యాపారం చేయగలిగినప్పటికీ, ప్రపంచ సముద్ర రంగం మరియు యూరోపియన్ యూనియన్‌ల మధ్య విస్తృత సంబంధాల కారణంగా కెప్టెన్ కమల్ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ ఆంక్షల కారణంగా అతను ఈయూ అనుబంధ నౌకలకు సేవలను అందించడం లేదా స్వీకరించడం కుదరదు. ఈయూ ఆంక్షలు నయారా ఎనర్జీ లిమిటెడ్ అనే భారతీయ రిఫైనరీ కార్యకలాపాలపై కూడా ప్రభావం చూపడం ప్రారంభించాయి. ఈ రిఫైనరీలో రష్యన్ సంస్థ రోస్‌నెఫ్ట్ కి 49.13 శాతం వాటా ఉంది. షిప్పింగ్ ఆపరేటర్లు నయారా ఎనర్జీతో ఉత్పత్తుల ఎగుమతులు మరియు ముడి చమురు దిగుమతులకు సహకరించడానికి వెనుకాడటంతో, కొన్ని రవాణాలు రద్దయ్యాయి. అయితే, భారతదేశం ఇతర దేశాలు విధించిన ఏకపక్ష ఆంక్షలను ఇప్పటికీ తిరస్కరిస్తోంది.

## యూరియా లోటుపై గుబులు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో అనుకూల వాతావరణంతో వానాకాలం పంటల సీజన్ ఊపందుకోగా.. కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా సరఫరాలో లోటు ఏర్పడడంపై వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. పరిస్థితి తీవ్రతను తెలియజేస్తూ కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు తుమ్మల లేఖ రాశారు. తెలంగాణకు కేటాయింపులకు అనుగుణంగా యూరియాను వెంటనే సరఫరా చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి జులై వరకు మొత్తం 6.60 లక్షల టన్నుల యూరియాకు గాను 4.23 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసింది. ప్రస్తుతం వరినాట్లు పడుతున్నాయి. దాంతోపాటు పత్తి, మొక్కజొన్నకు యూరియా అవసరం పెరుగుతుంది. ఆగస్టులో 1.16 కోట్ల ఎకరాలు సాగులోకి వస్తుందని అధికారుల అంచనా. దానికి 3 లక్షల టన్నుల యూరియా కావాలి. గత నాలుగు నెలల్లో వచ్చిన నిల్వల్లో పంపిణీ పోనూ మరో 1.45 లక్షల టన్నుల నిల్వలే ఉన్నాయి. ఇవి ఆగస్టు మొదటి వారం వరకే నిండుకునే వీలుంది. అప్పటికి అదనంగా యూరియా రాకపోతే సమస్యాత్మకంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

**అక్టోబరు 2 నాటికి ఉచిత చీరలు సిద్ధం చేయాలి**

తెలంగాణలో మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేయనున్న చీరలను అక్టోబరు 2 నాటికి సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. నేతన్నలకు రుణమాఫీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. శనివారం సచివాలయంలో చేనేత, జౌళిశాఖలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. '65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండేసి చీరలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి అనుగుణంగా చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలి.

# ఆర్సీబీకి బిగ్ షాక్.. చినస్వామి స్టేడియం పెద్ద ఈవెంట్లకు పనికి రాదని తేల్చిచెప్పిన జస్టిస్ కున్హా కమిషన్

**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగుళూరులోని చినస్వామి స్టేడియం పెద్ద పెద్ద ఈవెంట్లు నిర్వహించడానికి పనికి రాదని జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా కమిషన్ తేల్చింది. ఈ మేరకు కర్నాటక ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించింది. కాగా, 2025 ఐపీఎల్ విజేతగా ఆర్సీబీ నిలవడంతో 2025, జూన్ 4న బెంగుళూర్?లోని చినస్వామి స్టేడియం వద్ద విక్టరీ పరేడ్, ఆటగాళ్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్?కు అభిమానులు ఊహించిన దానికంటే ఎక్కువ మంది తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 11 మంది మరణించగా.. 50 మంది గాయపడ్డారు.

ఈ ఘటనను సుమోటోగా తీసుకున్న కర్నాటక హైకోర్టు.. విచారణ కోసం జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేసింది. జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈ రిపోర్టులో ప్రధానంగా చినస్వామి స్టేడియంలోని లోపాలను ఎత్తిచూపారు. చిన్నస్వామి స్టేడియం పెద్ద పెద్ద కార్యక్రమాలు నిర్వహించడానికి సురక్షితం కాదని పేర్కొన్నారు.

"స్టేడియం రూపకల్పన, నిర్మాణం సామూహిక సమావేశాలకు సురక్షితం కాదు. స్టేడియం అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు రోడ్డు ఫుట్‌పాత్‌లకు అనుసంధానించారు. ఎంట్రీ గేట్ వద్ద జనసమూహం కోసం విశాలమైన ప్రాంతం లేదు. దీంతో ప్రేక్షకులు ఫుట్‌పాత్ లేదా రహదారిపై క్యూలో నిలబడవలసి వస్తోంది. ఇది పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కల్గిస్తోంది. దుండగులు నేరుగా స్టేడియంలో వచ్చే అవకాశం ఉంది. స్టేడియానికి సరైన భద్రతా నిర్వహణ లేదు. దీనికి తగ్గట్టుగా స్టేడియంలో మార్పులు చేసే వరకు చినస్వామి స్టేడియంలో పెద్ద పెద్ద ఈవెంట్లు కండక్ట్ చేయడం సేఫ్ కాదు" అని జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా రిపోర్టులో పేర్కొన్నారు. కాగా, బెంగుళూరు తొక్కిసలాటకు ఆర్సీబీ యాజమాన్యం, డీఎన్ఏ





ఎంటర్టైన్మెంట్, పోలీసుల నిర్లక్ష్యమే కారణమని.. తొక్కిసలాటకు పూర్తిగా వీళ్లే బాధ్యత వహించాలని జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా ప్రభుత్వానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే జస్టిస్ డి'కున్హా నివేదికకు కర్నాటక కేబినెట్ ఆమోదం తెలిపి.. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలకు సిద్ధమవుతోంది. ఆర్సీబీ హెూంగ్రౌండ్ చినస్వామి స్టేడియం పెద్ద పెద్ద ఈవెంట్లకు పనికి రాదని జస్టిస్ కున్హా కమిషన్ తేల్చిచెప్పడంతో ఈ విషయంలో కర్నాటక సర్కార్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటుందో చూడాలి.

# 'పెద్దపులి' కనిపిస్తే



**హైదరాబాద్ పెన్ పవర్::** అభయారణ్యాల్లో పర్యటనలు పెరుగుతున్నాయి. అటవీ సమీప గ్రామాల్లో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్ల దాడిలో తెలుగు రాష్ట్రాల్లో చాలా మంది గాయపడ్డారు. పెద్దపులుల దాడిలో తెలంగాణలో నాలుగైదేళ్ల క్రితం ఇద్దరు, కొద్ది నెలల క్రితం ఒకరు.. ప్రాణాలు కోల్పోయారు. తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లోనూ తరచూ చిరుతలు సంచరిస్తున్నాయి. తిరుమలలో తితిదే బ్యాటరీ స్టేషన్ ప్రాంతాల్లో శనివారం రాత్రి చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. అటవీ ప్రాంతాల్లోనే కాదు కొన్నిసార్లు జనావాసాల్లోకీ ఈ క్రూరమృగాలు వస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుందాం.

### ఒంటరిగా వెళ్లొద్దు..

అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దు. కనీసం ఇద్దరు, ముగ్గురితో వెళ్లాలి. చేతిలో బలమైన వెదురు కర్ర ఉండాలి. సమీప గ్రామస్థుల్ని వెంట తీసుకెళ్లాలి.

అడవిలో ఎక్కడైనా జింక, పశువు చనిపోయి ఉంటే సమీపంలో పులి ఉంటుందని సంకేతం. పక్షులు, నెమళ్ల అరుపులు వినిపిస్తే అప్రమత్తం కావాలి. పెద్దపులి, చిరుత వచ్చేప్పుడు అలారంలా నెమళ్లు అరుపులతో హెచ్చరికలు చేస్తాయి. అడవుల్లో పొదలు, గుహలు వంటి చీకటి ప్రదేశాలు పులుల ఆవాసాలు.

పెద్దపులులు ప్రధానంగా అమ్రాబాద్, కవ్వాల్, నాగార్జునసాగర్ వంటి టైగర్ రిజర్వ్‌ల్లో సంచరిస్తున్నాయి. చిరుతలు, పెద్దపులులు అభయారణ్యాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లోని అడవులు, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో.. వ్యవసాయ పొలాల్లోనూ సంచరిస్తున్నాయి.

శ్రీశైలానికి వచ్చే భక్తులకు నల్లమల అడవిలో రహదారి పక్కన పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు తారసపడతాయి.

ఏపీలో కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని నల్లమల అడవికి సమీపప్రాంతాల్లో పులులు, చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం ఉంది.

### ఒక్కో అడుగు వెనక్కు వేస్తూ

పెద్దపులి ఎదురుపడ్డప్పుడు ప్రశాంతంగా ఉండాలి. 15-20 మీటర్లకుపైగా దూరంలో కనిపిస్తే ఇబ్బంది ఉండదు. మనిషి ముఖం పులి వైపే ఉండాలి. రివర్స్‌లో ఒక్కో అడుగు వెనక్కి వేసుకుంటూ ఆ ప్రాంతాన్ని విడిచిపెడితే సురక్షితంగా బయటపడొచ్చు. అడవిలోకి వెంట శునకాల్ని తీసుకెళ్లాలి. పులి వాసనను గుర్తించి గట్టిగా అరిచి అప్రమత్తం చేస్తాయి. సాధారణంగా పులులు మనిషిపై దాడిచేయవు. ఎలుగుబంట్ల విషయంలోనూ ఇవే జాగ్రత్తలు తీసుకోవాలి.

### పరుగెత్తొద్దు.. కళ్లలోకి చూడొద్దు

పెద్దపులి ఎదురుపడితే పరుగెత్తొద్దు. కళ్లలోకి చూడొద్దు. వీపు భాగం చూపించొద్దు. వంగితే జంతువు అనుకుని మనిషి వెనుకభాగంపై పంజా విసురుతుంది. నిలబడే ఉండాలి. పక్కన చెట్లు ఉంటే అక్కడ పనిచేస్తున్నట్లు ఉండాలి. పులులకు వినికిడి శక్తి, చూపు ఎక్కువ. మనుషులు వస్తుంటే అవే జాగ్రత్తపడి దూరం వెళతాయి.

# బయటపడుతోన్న సునీల్ అహుజా అరాచకాలు..,మోకిలా పీఎస్ లో కేసు








**హైదరాబాద్ పెన్ పవర్:**సునీల్ కుమార్ అహుజా, ఆశిష్ కుమార్ అహుజా పై మోకిలా పీఎస్ లో కేసు నమోదు అయ్యింది. షేక్ ఫరీద్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. షేక్ ఫరీద్ అనే వ్యక్తి సునీల్ కుమార్ అహుజా దగ్గర రూ. 17 కోట్లు లోన్ తీసుకున్నాడు. లోన్ ఇచ్చేటపుడు ఫరీద్ నుంచి కోట్ల రూపాయలు విలువ చేసే ల్యాండ్ పత్రాలు సెక్యూరిటీ గా తీసుకున్నాడు సునీల్ అహుజా. మోకిలా, శంకర్ పల్లిలో ఖరీదైన ల్యాండ్ పత్రాలు సెక్యూరిటిగా పెట్టాడు ఫరీద్.

రూ.17 కోట్లకు వడ్డీతో కలిపి సునీల్ అహుజాకు రూ. 22 కోట్లు చెల్లించాడు ఫరీద్. అయినా సరే ల్యాండ్ డాక్యుమెంట్స్ ఇవ్వకుండా కబ్జా చేశారు సునీల్ కుమార్ అహుజా, ఆశిష్ కుమార్ అహుజా . అంతటితో ఆగకుండా ఈ ల్యాండ్ తమదేనని అహుజా తండ్రి కొడుకులిద్దరు తనను బెదిరిస్తున్నారని బాధితుడు షేక్ ఫరీద్ మోకిలా పీఎస్ లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సునీల్ కుమార్ అహుజా, ఆశిష్ అహుజా పై కేసు నమోదు చేశారు. ఇదే సునీల్ అహుజా భారతి బిల్డర్స్ వ్యవహారం లోను ఇదే రీతిలో కబ్జా చేశాడు. భారతి బిల్డర్స్ వ్యవహారంలో బాధితులు 500 మంది వరకు ఉన్నారు. భారతి బిల్డర్స్ పేరుతో చలామణి అయిన ప్రీ లాంచ్ ప్రాజెక్ట్?కు కోట్ల రూపాయలు చెల్లింపులు చేశామని 250 బాధితులు రోడ్డెక్కారు. 5 సంవత్సరాల కిందట భారతి బిల్డర్స్ ఈ ప్రాజెక్ట్ మొదలు పెట్టింది. భారతి బిల్డర్స్ కనీసం 25 శాతం పనులు కూడా చేయలేదు. సాకులు చెబుతూ భారతి బిల్డర్స్ బాధితులను మోసం చేస్తూ వచ్చింది.

అనూహ్యంగా సునీల్ అహుజా అనే వ్యక్తికి ల్యాండ్ అమ్మేసి ప్రీ లాంచ్ ప్రాజెక్టుకు డబ్బులు కట్టిన పబ్లిక్?ను భారతి బిల్డర్స్ నిండా ముంచేసింది. ఇదేంటని

భారతి బిల్డర్స్?ను బాధితులు ప్రశ్నించగా.. భారతి బిల్డర్స్, సునీల్ అహుజా అనే వ్యక్తి బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారతి బిల్డర్స్?తో పాటు సునీల్ అహుజాపై సైబరాబాద్?లో ఆర్థిక నేర విభాగం(%జుూఔ%) పోలీసులు కేసు నమోదు చేశారు.